# రాయల్టీల ప్రవాహం

**సంస్థాగత** మదుపుదారుల సలహాసేవలు (ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ ఎడ్వైజరీ సర్వీసెస్-IIAS) అనే ఒక వ్యాపార సంస్థ చేపట్టిన అధ్యయన సూచీలో వున్న 32 బహుళజాతి సంస్థలు 2015-16 సంవత్సరానికిగాను 7100 కోట్ల రూపాయలు రాయల్టీల రూపంలో చెల్లించాయని, ఇది వాటి ప్రీటాక్స్ లాభాల్లో 21 శాతమని తెలియజేసింది. వాస్తవానికి 2015-16తో ముగిసిన 5 సంవత్సరాల కాలంలో బహుళజాతి సంస్థలు చెల్లించిన రాయల్టీలు 13 శాతం పెరగగా, వాటి ప్రీటాక్స్ లాభాలు మాత్రం 9.6 శాతం మాత్రమే పెరిగాయి. (బిజినెస్ స్టాండర్డ్ 15-9-2017).

రాయల్టీ చెల్లింపులను క్రమబద్ధీకరించే పని ప్రభుత్వం చేసేది. ఇది సాంకేతిక సహకార అంశాలలో ఎగుమతులలో 8 శాతాన్ని, దేశీయ అమ్మకాల్లో 5 శాతాన్ని మించరాదని నిర్ణయించింది. ట్రేడ్ మార్క్ లేదా బ్రాండ్ నేమ్‌ని ఉపయోగించేటప్పుడు ఎగుమతులలో 2 శాతంగాను, దేశీయ అమ్మకాలలో 1శాతంగాను రాయల్టీ నిర్ధారించబడింది. 2009లో ప్రభుత్వం రాయల్టీ చెల్లింపులపై ఉన్న పరిమితులను తీసివేయటంతో అనేక బహుళజాతి కంపెనీలు తమతమ మాతృసంస్థలకు రాయల్టీ చెల్లింపులను పెంచివేశాయి. అప్పటినుండి బహుళజాతి కంపెనీల శాఖలు తమ ఆదాయాలతోను, లాభాలతోను సంబంధం లేకుండా వివిధ రూపాలలో రాయల్టీ చెల్లింపులను అధికం చేశాయి.

2012లో ప్రభుత్వం రాయల్టీలపై పన్నును 10 నుండి 25 శాతం వరకు పెంచి విదేశీ మారక ద్రవ్య తరలింపుకు అడ్డుకట్టవేయజూసింది. కానీ దాని ప్రభావం ఏమంతగా వాటిపై పడలేదు. ఎందుకంటే బహుళజాతి కంపెనీల కేంద్రాలు నెలవైవున్న సామ్రాజ్యవాద దేశాలతో ద్వివిధ పన్ను నివారణ ఒప్పందాలను భారతదేశం చేసుకుంది కనుక. ఇంకా చెప్పాలంటే చాలా కంపెనీలు నోకియా విషయంలో జరిగినట్లుగా రాయల్టీలపై వేలకోట్ల రూపాయల పన్నులను చెల్లించనే లేదు.

విదేశీ మారక ద్రవ్య నిల్వలు తరిగిపోవటం పట్ల విదేశీ అప్పుల చెల్లింపుకు లోటు కలుగు తుందేమోనని ప్రభుత్వం ఆందోళనగా వుంది. ఇండియాలోని బహుళజాతి కంపెనీల శాఖలలో మైనారిటీగా వున్న భాగస్తులకు వాళ్ళు పెట్టిన మదుపుపై చెల్లింపులు తగ్గుతాయేమోనని కూడా ఆందోళన చెందుతోంది. కానీ చట్టపరంగానూ, చట్టవిరుద్ధంగానూ దేశ ఆర్థిక వనరులు తరలి పోవటంపట్ల దానికేమాత్రం చింతలేదు. ఒకటి మాత్రం స్పష్టం. ప్రభుత్వం విదేశీ పెట్టుబడి ప్రయోజనాలకు ఊడిగం చేస్తూ భారత సమాజానికి హాని చేస్తోంది.

oooooo